# బతకాల బాబూ మీలాంటోళ్లు బతకాల!

## ఎ.వి.రెడ్డిశాస్త్రి


టేబుల్ ముందు ఎవరో నిలబడినట్లనిపిస్తే తలెత్తి చూశాను. నలభై, నలభై ఐదేళ్లు వుండవచ్చునేమో. కళ్ళల్లో దైన్యం, నీరసం, ఆకృతిలో స్పష్టంగా కనిపిస్తున్న పేదరికం.

'ఏం కావాలమ్మా?'

'తమతో ఒకమాట చెప్పుకుందామని'

సగం విరిగిన కుర్చీ మీంచి ఫైళ్లు తీసి పక్కన పెట్టి 'కూర్చోండి, కాస్త జాగ్రత్త... కుర్చీ సరిగ్గాలేదు'అన్నాను. ఆమె ఆశ్చర్యపోయినట్లు కనిపించింది. కూర్చోమన్నానని కాబోలు. సంకోచిస్తుంటే, 'ఫర్వాలేదు కూర్చోండి. ఐదు నిమిషాల్లో ఈ ఫైలు చదవటం పూర్తయిపోతుంది, అప్పుడు చెబుదురుగాని వివరాలు'

చాలా ఒదిగిపోతూ కూర్చుంది. కాయితాలు చదవటం పూర్తయింది. ఆ ఫైలు పక్కకి పెట్టి 'చెప్పండి! ఏం పని మీదొచ్చారు?' అన్నాను.



లంచ్ టైం.ఆఫీసంతా ఖాళీగా ఉంది. అయినా, బాగా మెల్లగా, రహస్యం మాట్టాడుతున్నట్టు 'నా పెన్షను గురించి బాబూ..' అంది మాట పూర్తి చెయ్యకుండా

'మీ మీరూ, వార్డు నెంబరూ చెప్పండి'

చెప్పింది.

'అది నావార్డు కాదే'

'కాదు బాబూ, నాకు తెలుసు'

'ఆ వెంకటస్వామి గారు చూస్తారండి'

'మరలాగైతే ఆయన్నే వెళ్లి అడగండి'

'అడిగానండి..'

'ఏఁవన్నాడు?'

అటూఇటూ చూసింది. ఎవరూ లేరని రూఢి పరుచుకొని,

'ఆయనకి డబ్బులిస్తేగాని రాయడటండి'

'అవును--అదీ నిజఁవే. అతగాడు అడిగిందేదో పారేయండి-రాసేస్తాడు.'

ఆమె కళ్లల్లో దైన్యం. కన్నీళ్లని బలవంతంగా ఆపుకుంటున్నట్టు తెలిసిపోతోంది. ప్రయత్నం చేసిన మీదట మాట్లాడగలిగింది. 'ఆకలికి నేను నాకూతురూ మలమల మాడిపోతున్నాం బాబూ! ఆ పెన్షన్ వస్తే, ఇంత గంజేనా తాగడానికి కవుతుం దనుకుంటే, ఆ బాబు డబ్బులు తెమ్మంటున్నాడు. ఎక్కడ్నుంచి తేగలను బాబు గారూ'

'అమ్మా! మీ పరిస్థితి అర్ధఁవయింది. కాని అందులో నేనేం చేయగల్నో తెలీడం లేదు'

'అతగాడికి కొంచెం చెప్పిపెట్టండి బాబూ, మీరు చెబితే వింటారని ఎవరో అన్నారయ్యా!'

'అది ఉత్తిమాట--వినడమ్మా. డబ్బు దగ్గరికి వచ్చేటప్పటికి ఎవరి మాటా వినడు. అయినా అడిగి చూస్తాను.

'అలాగే, వస్తాను బాబూ! కానీ చెప్పేను కదా! మీరీ సాయం చేస్తే, నేనూ కూతురూ మీ పేరు చెప్పుకుని ఇంత గంజి తాగ్గలుగుతాం'

ఈసారి ఆమె కన్నీళ్లు దాచుకోవడానికి ప్రయత్నం చెయ్యలేదు.

నాకూ కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి, ఆమె దైన్యస్థితి గురించి వింటుంటే.

ఇంతలో ఎవరో స్టాఫ్-లంచ్ అయిపోయి ఉంటుంది-లోపలికి వస్తున్న అలికిడి.

అర్జంటు పేపర్లు చూస్తున్నట్టు కాగితాల్లో తలని దాచేస్కున్నాను.

మెల్లగా లేచి వెళ్లిపోతోంది. వెళ్లిపోతున్న ఆమెను చూస్తుంటే చాలా బాధనిపించింది. కృశించి పోయిన శరీరాన్ని ఎంతో కష్టం మీద ఈడ్చు కుంటూ వెళుతోంది. వేస్తున్న ప్రతీ అడుగులోనూ నీరసం, నిస్త్రాణం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నాలుగు దాటేక కాస్త హడావిడి తగ్గింది ఆఫీసులో. లేచి అతని సీటు దగ్గరికి వెళ్లేను 'ఏఁవిటిలా వచ్చేవ్?'

చెప్పేను

'పేరేఁవిటన్నావ్?'

'సుమిత్రట'

'ఆ కేండిడేటా? ఆవిడ కేసు అవడం కష్టం'

'అసలు సంగతేఁవిటో చెప్పు'

'ఇంతకీ, నీకేఁవిటి ఇంటరెస్టు?'

'నా దగ్గరకొచ్చింది. తను చాలా బీదదాన్ననీ, తనూ తన కూతురూ ఆకలితో మలమల మాడిపోతున్నామనీ, ఈ పెన్షనంటూవొస్తే కొంచెం గంజితాగడానికేనా వీలుపడుతుందనీ, కంటనీరు పెట్టుకొని చెప్పింది'

'అవును. నాతోనీ అలాగే చెప్పింది'

'చాలా బీదదాన్లా కనిపించింది. తిండిలేనట్టు తెలిసిపోతోంది'

'చూడు బ్రదర్, ఈ పెన్షన్లు బీదవాళ్లకే గాని డబ్బున్నవాళ్లకి కాదు. కానీ, వీటి కోసం అప్లయ్ చేస్తున్న వాళ్లల్లో చాలా మంది పేదవాళ్లు కానేకారు. దొంగ సర్టిఫికెట్లు పెట్టి పెన్షన్ కొట్టేస్తున్నారు'

'నీ వుద్దేశం స్పష్టంగా చెప్పు. మన్లోమనం చెప్పుకోవడానికి సంకోచఁవెందుకూ!'

'అదేం లేదు,అడిగేవు కనుక చెప్తున్నాను. వాళ్లు దొంగ సర్టిఫెకెట్లుపెట్టి పెన్షన్లు కొట్టేస్తున్నప్పుడు, ఆర్డర్లు జారీ చేయిస్తున్నాను కదా! మరి నాకు తృణమో, పణమో యివ్వండని అడిగి పుచ్చుకుంటే, అందులో తప్పేఁవిటుందీ?'

'నాకు ఇలాటి విషయాలు పెద్దగా తెలీవని నీకు తెలుసు కదా?'

'అవును కదూ..నువ్వు నిష్కాగరిష్టుడివి. కాని, నువ్వు అక్కడితో ఆగిపోతే మంచిది. గడ్డికుప్ప దగ్గర కుక్కలా మాత్రం ప్రవర్తించకు'.


'సరే..ఆమె మళ్లీ నా దగ్గరికి వస్తే, నీ ఫార్మాలిటీ ఫుల్‌ఫిల్ చేసి, ఆర్డర్ తీస్కోమని చెప్తాను''

'అదీ..ఇప్పుడు సరిగ్గా మాట్లాడుతున్నావ్'

రెండ్రోజులు పోయాక ఆమె వచ్చింది. చెప్పేను సంగతి. తలదించుకొని వలవల ఏడ్చింది. 'నేను దొంగ సర్టిఫికెటు పెట్టలేదు బాబు గారూ! నా కష్ట పరిస్థితి స్వయంగా ఎరిగి ఉన్న మా సర్పంచి గారు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ గారితో మాట్లాడి నాకు ఆ కాయితం ఇప్పించేరు బాబూ'అంటూ మళ్లీ నిశ్శబ్దంగా కన్నీళ్లు పెట్టుకుంది. ఎంతో సంకోచపడిపోతూనే చెప్పేను, 'పోనీ, ఎట్టాగో తంటాలుపడి, అతని మామూలేదో అతనికి ఇచ్చెయ్యలేరా?'

పెద్ద నిట్టూర్పు విడిచి తలదించుకుంది. ఆమె ఏడుస్తోందని తెలిసిపోతోంది. కాని, ఏమీ చేయలేని స్థితి నాది. నా మట్టుకు నాకు చాలా ఇబ్బందిగా వుంది ఈతతంగమంతా. కళ్ళు తుడుచుకుంటూ ఏడుపు స్వరంతో ఆమే చెప్పింది, 'నాకింక భూమ్మీద పైసా కూడా అప్పు పుట్టదు బాబూ, ఇవ్వగలిగిన వాళ్లందరి దగ్గిరా అప్పులు చేసేశాను'.

ఏం చెప్పాలి ఆవిడికి? ఏమీ చెప్పకుండా అలా ఎంతసేపని కూర్చోపెట్టగలను? చివరికి తెగింపు నిర్ణయం చేస్కొని ఆడిగాను, అతని



కవిత

## ఫేర్‌వెల్

కండక్టరయినా కలక్టరయినా
పదవేదయినా విరమణ మరణమే కదా
రిటైర్‌మెంట్ రోజున
నాన్న ముఖం చూస్తే అలానే అనిపించింది
వర్క్ ఈజ్ వర్‌షిప్ అని
పనిలో తలమునకలవడం
వరమైన అనుభూతి అనే నాన్న
ఈవేళ పనిలేని వెలితిని
ఆమోదించలేకపోవడం సహజమే మరి
చిన్నప్పుడు డ్యూటీ ఈజ్ గాడ్ అని
నరనరాన నూరిపోసిన నాన్న ఇప్పుడు
దేవుడికి భక్తుడికి మధ్య అనుసంధానం
తెగిపోయినట్టు విలవిలలాడుతున్నారు
రిటైర్‌మెంట్ అంటే పదవి నుంచే కాదు
జనం నుంచీ నిష్క్రమించడమనే నాన్న
సార్వభౌమత్వాన్ని కోల్పోయిన
మహరాజులా అనిపిస్తున్నారు
శెలవంటూ తలవంచుకు వెళ్లిపోతూ
రిటైర్‌మెంట్ ముళ్లకిరీటాన్ని
మోస్తున్న క్రీస్తులా వున్నారు
చైతన్య స్రవంతి లాంటి నాన్న
నిశ్చల చిత్తరువై నిలిచిపోగా
వీడ్కోలు పలుకలేని
వెల్లవేసిన ఆఫీసు గోడలు
తెల్లబోయి చూస్తున్నాయి
కొడుకులా ప్రవేశించి
తలపండిన తాతలా
వీడ్కోలంటున్న నాన్నని చూసి
ఆవరణలోని చెట్లన్నీ దుఃఖభారంతో
పత్రహరితాన్ని రాల్చుకుంటున్నాయి
నే కోరితే కాదనకుండా
కొండమీది కోతిని కూడా తెచ్చివ్వగల నాన్న
ఇవాళ తాయిలం పోగొట్టుకుని బిక్కమొగం వేసిన
చిన్నపిల్లాడిలా కనిపిస్తున్నారు
తన ప్రతి అనుభూతిని
నా అనుభవంలోకి తేవాలని
తపించిపోయే నాన్న
నా ఆనందంలో సంతోషపు తరగై
నా దుఃఖంలో కన్నీటి చుక్కై
వెలుగై, వరదై, దిక్సూచై
ఆసాంతం నన్ను కమ్మేసిన నాన్న
తరుణోపాయం తెలియని తాపసిలా ఉన్నారు
తన గుండెల పానుపు మీద
స్వర్గ సౌఖ్యాలూ అందించిన నాన్నకి
అమ్మనై, నాన్ననై అపురూపంగా లాలించాలనుంది
చిన్నప్పుడు నా చేయి పట్టుకుని
అడుగులేయించిన నాన్నకి
శెలవులూ సోమరితనాలూ లేని
సరికొత్త ప్రపంచంలోకి
నడిపించుకు వెళ్లాలనుంది

–ఆవాల శారద




మామూలు ఎంతని?

ఎంతో సిగ్గుపడుతూ చెప్పింది.

'సరే! రేపు ఫస్టు కదా? రెండో తారీకునో, మూడో తారీకునో ఓ మారు రండి పని జరిగేలా చూస్తాను'

మూడో తారీకున వచ్చింది. ఒక కవరు ఆమెకి అందించేను. 'అతనికి ఇది ఇచ్చేసి ఆర్డరుకి ఎప్పుడు రమ్మంటాడో కనుక్కోండి'

ఆమె స్టన్ అయిపోయి నిలబడిపోవడం గమనించేను. దాంతో అక్కడ ఉండకుండా గబగబ బయటికి వెళ్లిపోయేను. నా సీటు దగ్గరా, తదుపరి అతని సీటు దగ్గరా సీన్లు క్రియేటయితే, నేను భరించలేను.

ఆఫీస్ అవర్స్ అయిపోయేక నా దగ్గరికొచ్చి, 'ఏఁవిటి గురూ, ఏదో రొమాన్స్ బిగిన్ చేస్తున్నాట్టున్నావ్?' అడిగాడు వెంకటస్వామి వెటకారంగా.

'ఏఁవిటీ నువ్వు మాట్లాడుతున్నది' అన్నాను కాస్త తీవ్రంగా..

'కాకపోతే ఏఁవనుకోవాలి! నాకివ్వవలసిని మామూలు నువ్వు సర్దేవట కదా'!

'నీకు ముట్టవలసింది ముట్టి పోయింది కదా! ఇంక దాని గురించి తర్జనభర్జన ఎందుకు?ఆవిడ ఆర్డరేదో ఆవిడకిచ్చేయ్'

'గురూ! నేను పోల్చలేననుకోకు. వయసు దాటితేనేం గాక, ఆకేండేటులో బిగి, అందం పోలేదు. వలవిసిరి చూద్దాం అనుకున్నట్లున్నావ్. అంతేనా? అయినా, నాకు తెలియకడుగుతానూ...ఈ తిప్పలన్నీ ఎందుకూ? ఎవత్తెనో చూసి లక్షణంగా పెళ్లి చేసుకోకూడదూ!'

నాకు అసహ్యం వేసింది అతని మాటలు వింటుంటే. సంస్కారం లేకుండా ఎంత దరిద్రంగా మాట్లాడుతున్నాడు! కాని వాడితో గొడవ పెట్టుకుంటే, నిష్కారణంగా ఆవిడ పని కూడా జరక్కుండా అయిపోతుంది. మాట్లాడుకుండా లేచి బయటికి వెళ్లబోతుంటే, 'ఇలా ఎంత మందికి దానధర్మాలు చేస్తావ్? ఆఫీస్ కొచ్చేటప్పుడు, నువ్వు ఎలాటి బట్టలు వేసుకొని వస్తున్నావో గమనిస్తున్నావా? సాటి ఉద్యోగులంతా ఫ్యాషన్‌గా తయారై వస్తుంటే, నువ్వు చింకిన బట్టలూ, మాసిన బట్టలూ వేస్కొని వస్తుండడం, నెలలో సగం రోజులు లంచ్‌కి అంబలో, జావో తెచ్చుకోడం..యివన్నీ ఎవరూ గమనించడం లేదను కుంటున్నావా? అందర్లాగా నువ్వూ ఎందుకు బతక్కూడదూ!' వెంకటస్వామి అలా ఎంతదూరం వెళతాడో చెప్పడం కష్టమే. 'ఉండు..అర్జంటుగా నేచర్ కాల్' అనేసి బయటికి వెళ్లిపోయేను.

***

కాస్త తీరుబడిగా ఉంది కదా అని ఆఫీసు వరండాలో నిలబడి తాపీగా సిగరెట్టు కాల్చుకుంటుంటే, కాళ్లు ఈడ్చుకుంటూ వస్తున్న సుమిత్ర కంటబడింది. దీని పెన్షన్ గొడవ కాదు గాని మనశ్శాంతి లేకుండా చేస్తోంది. దాని కథలన్నీ వింటూ కూర్చోడం పరమ బోరుగా ఉంటుంది. అందుకని నేనే అడిగేశాను, ముందుగా, 'ఏమిటమ్మా, మళ్లీ వొచ్చావు. కొంపతీసి పెన్షన్ గాని అందలేదా ఏమిటి?'

'అందింది బాబు. అందుకే సార్‌కి దండం పెట్టి వెళదామని వచ్చానయ్యా'

'ఎవరికీ...నీ ఫ్రెండ్ శాంతయ్యకా?'

'అవున్సార్'

'ఎందుకూ?'

'పెన్షన్ శాంక్షన్ అందింది కదా బాబూ–అందుకని'

'పెన్షన్ శాంక్షన్ చేయించింది నేనైతే దండాలు అతగాడికా?'

'మీక్కూడా దండాలు బాబు. ఆర్డరు ఇప్పించిన వారు తమరే. కానైతే, ఆ బాబుగారు ఉండబట్టే కదా, మీరు శాంక్షన్ చేశారు'

'సరే సరే..ఉత్తుత్తి దండాలేనా?....అతనికిద్దామని ఏదేనా బహుమానం తెచ్చావా?'

'మీరిప్పించిన పెన్షన్ డబ్బుతో కొన్ని అప్పులు తీర్చేను బాబూ! మిగిలిన కొంచెం డబ్బుల్లో ఈపూట నూకల్జావ కాచుకోడానికి వీలయింది. మొదటి దఫా భోజనం దొరికినట్టయింది బాబు. అందుకని, ఆ దేవుడికి ముందుగా నవిద్దం చేసి, ఈ తరువాత్తిందామని ఆఫీసుకి పరిగెత్తుకొచ్చాను బాబు'

చెప్పొద్దూ...నాకాశ్చర్యం వేసింది. ప్రపంచంలో ఈ కృతజ్ఞతలు, ఔదార్యాలు ఇంకా మిగిలి వున్నాయన్నా మాట. నాకెందుకో ఓ మంచిమాట అనాలనిపించింది.

'సుమిత్రమ్మా! నువ్వన్నదీ కొంతవరకు నిజమే. ఒక రకంగా చూస్తే అతగాడు దేవుడే. తన అవసరాలు కూడా చూసుకోకుండా, నీలాగ అడిగిన వాళ్ళందర్ని ఆదుకుంటూ ఉండేవాడు. దానివల్ల–ఏమైందో చూడు–ఇవాళ అతని చేతిలో చిల్లిగవ్వ లేదు. మందులు కొనుక్కోడానికి కూడా. మరో దారిలేక గవర్నమెంటాసుపత్రిలో చేరేడు– ఒంటికొచ్చి. ఎన్నాళ్ల నుండి అర్ధాకలితోనీ, పస్తులతోనీ ఉంటున్నాడో ఏమో..డాక్టర్లు పెదవి విరుస్తున్నారు. వెళ్ళు..వెళ్ళి చూడు, ఉంటాడో, ఊడతాడో'

***

'ఏమిటమ్మా, అంతలా ఆయాస పడిపోతూ పరిగెత్తుకొస్తున్నావ్'

'అదేవిటి బాబూ! బొత్తిగా మరీ బల్లిలా అయిపోయారు'

'అదలా ఉంచండి. మీరేమిటి మళ్ళీ ఆస్పత్రి దాకా పరుగెత్తుకొచ్చారు? కొంపదీసి మీ పెన్షన్ అందలేదా?'

'ఒచ్చింది బాబూ..ఒచ్చింది. అందుకనే మీకు దండం పెట్టుకుందామని'

'ఆఁ దానికోసం ఆస్పత్రికొచ్చేయాలా చెప్పండి. అసలే నీరసంగా కనిపిస్తున్నారు. దానికి తోడు ఈ గాడ్పుల ఎండలూ... ఎక్కడేనా మొకం తిరిగి పడిపోతే?'

'సుస్తీ చేసి మీరే ఆసుపత్రిలోచేరి, నా నీరసం గురించి మాట్టాడుతున్నారా బాబూ?'

ఆమె కళ్ళల్లో నీళ్లు

'ఛట్‌ఛట్–ప్రతి దానికి మీరలా కన్నీళ్ళుపెట్టుకోకండి. నాకేమీ కాలేదు. ఏదో కొంచెం నీరసం. అంతే. రక్తం లేదని, అదనీ, ఇదనీ డాక్టర్లంటుంటారు. అదంతా మామూలే. నాలుగు రోజుల్లో తిరిగొచ్చెయ్యనూ ఆఫీసుకి'అన్నాను నవ్వు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ...

'ఒచ్చేయండి బాబూ, వేగిరం ఒచ్చేయండి. ఆకలికీ, అప్పులాళ్ల తిట్లకి తట్టుకోలేక సచ్చిపోతే బాగుండ్నని ఎన్నోమార్లు అనిపించింది. మిమ్మల్ని చూసినాక బతుకు మీద మళ్ళీ ఆశపుట్టింది. మీలాటోళ్ళు బతకాల బాబుగారూ!' అంటూ కన్నీళ్ళు తుడుచుకుంటూ, పైనున్న దేవుడికోదండం పెడుతూ మెల్లగా వెళ్లిపోయింది సుమిత్ర.

✻


రచయిత సెల్ : 9848375179